

# జీవితం వేరు!

వీరభద్రరావు పమ్మి

మాధవి జాగ్రత్తగా వింటోంది.


సావిత్రి ఇంట్లోంచి మాటలు వినిపిస్తున్నాయి. అ మాటలు వింటుంటే మాధవికి కోపం వచ్చింది. అసహనంతో ఆమె కుత కుత లాడిపోయింది.

సావిత్రి మీదపట్టరానంత కోపంవచ్చింది.

మాటలు ఇంకా ఇంకా వినిపిస్తున్నాయి. తాగుబోతువాడి, తాగుబోతు మాటలు—అవి సావిత్రి మొగుడు మాట్లాడుతున్న మాటలు.

"ఛీ సావిత్రికి బుద్ధి లేదు. అనుకుంది మాధవి.

మళ్ళి జాగ్రత్తగా వింటోంగి.



అతనేదో తిడుతున్నాడు. ఆమె సమాధానం చెప్తోంది. మధ్యలో సావిత్రి పిల్లలు కలుగ జేసుకుంటున్నారు.

"అస్తమానం అమ్మని తిడతావ్ కొడ తావ్. బుద్దిలేదూ?" అని అడుగుతున్నాడు కొడుకు తండ్రిని.

"నోర్మూయ్‌రా వెధవా! తాగుబోతు తండ్రి మాటలు సారాలా ప్రవహిస్తున్నాయి.

"ఏమైనా సరే-రేపు సావిత్రికి గట్టిగా చీవాట్లు పెట్టాలి. అసలు ఆడదాని కష్టాలన్నిటికీ ఆడదే కారణం. సీతతోటి. సావిత్రితోటి భూదేవితోటి పోల్చి-ఆడదాన్ని అణగదొక్కారు. అయినా స్త్రీ తిరగబడదు. అనుకుంది మాధవి

"సావిత్రీ! కాళ్ళు పిసుకు." సావిత్రి మొగుడు అరుస్తున్నాడు.

❋❋❋❋

సావిత్రి తన పక్క వాటాలోకి వచ్చిన రోజునే మాధవి ఆమెని చూసింది. అంతక్రితం ఆ వాటాలో ఉన్న జానకి మాధవితో ఎంతో స్నేహంగా ఉండేది.

జానకి భర్తకి ట్రాన్స్‌ఫర్ కావడంతో వాళ్ళు మరో ఊరుకి వెళ్ళిపోయారు. ఆ వాటాలోకి కొత్తగా వచ్చేవాళ్ళు ఎలాంటి వాళ్ళో ఏమిటో అనుకుంది మాధవి. నగరాల్లో పక్కవాటావాళ్ళు కలుపుగోలుగా స్నేహంగా ఉండకపోతే తోత్తిగా తోచదు. అందులోను మాధవికి కబుర్లు చెప్పడమన్నా, వినడమన్నా మహాసరదా.

మొగుడు ఆఫీసుకి వెళ్ళిపోయాక తను పక్కవాటా కెళ్ళి కాలక్షేపం చెయ్యడమో లేదా ఆమెను తన వాటాలోకి రమ్మనడమో చేస్తుంది

సావిత్రి అక్కడికి వచ్చిన మొదటిరోజునే మాధవి వెళ్ళి ఆమెను పలకరించింది. ఆమాటా ఈ మాటా అయ్యాక పాపం మీరు. పిల్లలే సామానంతా తెచ్చుకున్నారు. మీవారు ఊళ్లో లేరా? అనడిగింది సావిత్రిని

లేరండి.... ఆయన .... కాంప్‌కెళ్లారు అని చెప్పింది సావిత్రి

వారం గడిచినా సావిత్రి భర్తరాలేదు.

'మీ వారు ఎప్పుడొస్తారు?' అనడిగింది మరో రోజున మాధవి.

చెప్పలేమండి ఆయనకి టూర్లు ఎక్కువగా ఉంటాయి. ఎప్పుడో హఠాత్తుగా దిగుతారు! అన్చెప్పి నవ్వేసింది.

అనతి కాలంలోనే సావిత్రి మాధవికి మంచి స్నేహితురాలై పోయింది. ఎంతో కలివిడిగా చనువుగా ఉంటారు. మాధవికి రెండేళ్ళ కొడుకు.

### వజ్రంలాంటి వదిన

వజ్రంలాంటి వదిన ఎక్కడి-కెళ్ళింది?" అన్నను అడిగాడు తమ్ముడు.

"ఆమె నిజంగా వజ్రమే! నన్ను చట్టరీత్యా బంధవిముక్తుడిని చేసి నగల వర్తకుడితో వెళ్ళిపోయింది.

దాగాపురం నాగేశ్వరరావు
(గద్వాల)

ఆమెకి ఏదైనా బజార్నుంచి కావల్సివస్తే సావిత్రి పిల్లలు తెచ్చిపెడతారు. వాళ్లు ఆంటీ ఆంటీ అంటూ చనువుగా మసలుతారు.

మరి కొన్నాళ్లు జరిగింది.

సావిత్రి భర్తరాలేదు. మాధవికి ఏదో అనుమానం మనసులో మెదుల్తోంది. కొంపదీసి ఆమె....

తన ఆలోచనకి తనే సిగ్గుపడింది మాధవి.

ఛ-ఛ- అర్ధరూపాయి కాసంత బొట్టుతో మెళ్లో పుస్తెలతో కాళ్ళకి మట్టెలతో ఉంటుంది సావిత్రి ఆలాంటిది....

ఎక్కువసేపు ఆలోచించ లేకపోయింది. నిజం నిలకడమీద తెలుస్తుందికదా అనుకుంది ఆమె.

❋ ❋ ❋ ❋ ❋

మాధవికి పెళ్ళయి నాల్గేళ్ళయ్యింది. భర్తకి ఏదో కంపెనీలోఉద్యోగం, మనిషిమంచి అందగాడు. స్ఫురద్రూపి. అలాంటి భర్తదొరికినందుకు మొదట్లో ఆమెచాలా ఆనందపడింది కాని....తర్వాతర్వాత ఆమెలో ఏదో భయం మొదలైంది

మగాడు అందంగాఉంటే ఆడపిల్లలు వెంటపడతారట, దానికి తగ్గట్టు ఆమెభర్త అప్పుడప్పుడు తన ఆఫీసులో అమ్మాయిల గురించి మాట్లాడతాడు.

ఇవన్నీ మాధవిలో ఓ రకమైన భయాన్ని సృష్టించాయి

* * *

రాత్రి పదకొండు గంటలైంది-

"సావిత్రి-సావిత్రి...."

ఎవరో గట్టిగా అరుస్తూ పక్కవాటా తలుపు కొడుతున్నారు. ఆ మాటలూ స్పష్టంగాలేవు. అరచేతిలోంచి నీళ్ళు జారినట్టు అతని పెదాల మీంచి జారిపోతున్నాయి.

మాధవికి మెలకువ వచ్చింది

ఎవరు పిలుస్తున్నారో. ఎందుకు పిలుస్తున్నారో ఆమెకి అర్థం కాలేదు. సావిత్రి ఏదైనా కష్టంలో ఉందా-అనిపించింది. ఎవడేనా అల్లరివెధవ తాగిరాలేదుకదా-అసలే ఆమె భర్త ఊళ్లో లేడు.

మాధవి తన భర్తని నిద్రలేపింది. విషయం చెప్పింది. "మనం అలా తొందరపడ కూడదు-అంతగా ఆమె పిలిస్తే వెడదాం" అన్నాడతను.

సావిత్రి వాటా తలుపు తీసిన చప్పుడైంది. మళ్ళీ తలుపు మూసుకున్నచప్పుడూ అయ్యింది.


తాగుబోతు మనిషిగట్టిగా మాట్లాడ్డం అరవడం. కేకలు పెట్టడం..........అన్నీ వినిపిస్తున్నాయి.

అంతగట్టిగా మాటాడొద్దని సావిత్రి బతిమాలుతోంది. ఆ మాటలూ వినిపిస్తున్నాయి.

మాధవికి ఏవీ అర్థం కాలేదు-ఆలోచిస్తూ నిద్రపోయింది.

మర్నాడు సావిత్రి మాధవి ఇంటికిరాలేదు. మాధవి కూడా వెళ్ళలేదు. ఏదో ఇబ్బందిగా అనిపించింది. మామూల ఆ తాగుబోతు ఎవరో ఎందుకొచ్చాడో తెల్సుకోవాలని ఆత్రంగా ఉంది.

ఆమర్నాడు మాధవి యధాతధంగా సావిత్రి ఇంటికెళ్ళింది. అసలా విషయం ఎత్తకూడదని ముందే అనుకుంది.



వారం రోజులు పోయాక మళ్ళీ "తాగుబోతు" సావిత్రి ఇంటికి వచ్చాడు. మళ్ళీ కేకలు. అల్లరి హడావుడి....

మర్నాడు పగలు కూడా అతను అక్కడే ఉండిపోయాడు. పగలుకూడా తాగేసినట్టున్నాడు. అల్లరి చేసాడు.

అతనే సావిత్రి మొగుడేమోనని మాధవికి అనుమానం కలిగింది. అలాంటప్పుడు అతను సావిత్రితోనే ఉండాలికదా—ఎప్పుడో వారానికి, పదిరోజులకి ఓసారివచ్చి వెళ్ళిపోతాడేం?

మరి కొన్నాళ్ళు పోయాక సావిత్రే అసలు కథంతా చెప్పింది.

* * *

సావిత్రికి యుక్తవయసు వచ్చాక తలిదండ్రులు పెళ్ళిచేసారు. ఆమెభర్త జోగారావు బ్యాంక్‌లో గుమాస్తాగా పనిచేస్తాడు. మొదట్లో అతను ఎంతో ప్రేమగా, ఆదరంగా ఉండేవాడు.

సావిత్రి తనఅదృష్టానికిమురిసిపోయింది. అన్యోన్యంగా, హాయిగా బాగానే బతికేరు.

కాని ఆమె ఆనందం ఎక్కువ కాలం నిలబడలేదు.

స్నేహితులతో సరదాకి, పార్టీలకి తాగడం మొదలు పెట్టిన జోగారావు తాగుబోతు అయ్యాడు.

సావిత్రి ఎంతబతిమాలినా, పోట్లాడినా, యుద్ధం చేసినా లాభంలేకపోయింది.

తన దురదృష్టానికి కుమిలిపోవడం తప్ప ఇంకేమీ చెయ్యలేకపోయింది. కాని ఆమె దురదృష్టం అంతటితో ఆగిపోలేదు.

జోగారావు మెర్సీఅనే అమ్మాయిని రెండో పెళ్ళి చేసుకున్నాడు. చేసుకున్న చాలా రోజులకుగాని ఆ విషయం సావిత్రికి తెలియలేదు. తెలిసాక గొల్లున ఏడ్చింది. మొగుణ్ని బతిమాలింది. పోట్లాడింది. "నేను మీకేం అన్యాయం చేసాను?" అనడిగింది—

*పండంటిబిడ్డ*

ఒక యువరచయిత్రి కథ పంపిస్తూ ఎడిటర్‌కి ఇలారాసింది.

"ఆర్యా! ఇంతవరకు ఎనిమిదికథలు పంపిస్తే తిరిగి పంపించారు. ఎనిమిది సార్లు అబార్షన్ అయినంత బాధపడ్డాను. ఈసారైనా పండంటిబిడ్డ పుట్టినట్లు ఈ కథని స్వీకరిస్తారని ఆశిస్తున్నాను"

ఎస్. సావిత్రిమోహనహరి
(మల్కాజ్‌గిరి)

ఎంతో విలపించింది.

ఎన్నోసార్లు అడగ్గా అడగ్గా "మెర్సీ నీకన్నా అందంగా ఉంటుంది" అన్నాడు.

సావిత్రి అహం దెబ్బతింది. మళ్ళీ ఆ విషయం అడగలేదు. జోగారావు మెర్సీనిపెళ్ళి చేసుకోడానికి కారణం—రకరకాలుగా చెప్తారు.

ఆమెను కావాలనే చేసుకున్నాడని కొందరంటారు. అలాకాదు—అతనామెతో సంబంధం పెట్టుకున్నాడు. అది తెల్సిన ఆమె తరఫువాళ్ళు అతన్ని బెదిరించి, భయపెట్టి-బలవంతంగా చేసారని కొందరంటారు.

ఏమైతేనేం సావిత్రికొంపకూలిపోయింది.

అప్పటికే సావిత్రికి ఇద్దరు బిడ్డలు కలిగారు. మొగుడు తాగుబోతయినా, ఆకతాయి వెధవైనా, రెండు పెళ్ళిళ్ళు చేసుకున్నవాడైనా పరిస్థితులతో రాజీపడి బతకడం కన్నా ఈ దేశంలో ఆడదానికి వేరేదారిలేదు.

సావిత్రి జీవితంతో రాజీపడి, మనసు రాయిచేసుకుని పిల్లల కోసం—బతుకుతోంది.

రానురాను జోగారావు ఇంటికి రావడం తగ్గించేసాడు. సావిత్రికి డబ్బు ఇవ్వడం మానేశాడు. ఆమె పిల్లలతో బతుకు ఈడ్వలేక నరకయాతన పడింది.

పెద్దగా చదువుకోలేదు—అంచేత ఉద్యోగం వచ్చే ప్రసక్తిలేదు,

చివరికి అన్నగారి సాయంతో, ప్రోద్బలంతో—తన భర్త తనని, పిల్లల్ని చూడటం లేదని, కాబట్టి అతని జీతంలో కొంతసొమ్ము తనకుఇవ్వాలని బ్యాంక్ వాళ్ళకు అప్లికేషన్ పెట్టుకుంది.

బ్యాంక్ అధికార్లు విషయమంతా విచారించి—జోగారావు జీతంలో కొంత సొమ్ము సావిత్రికి ఇచ్చే ఏర్పాటు చేసారు.

దానికి తోడుగా—పప్పురుబ్బే మిషన్ కొనుక్కుని—దానిమీద కొద్దిగా సంపాదిస్తూ కాలక్షేపం చేస్తోంది సావిత్రి.

పిల్లలు పెరిగి పెద్దవాళ్ళవుతున్నారు. వాళ్ళ అవసరాలు పెరుగుతున్నాయి. అంతేకాదు— "నాన్న ఇంటికి రాడేం?" అనడుగుతున్నారు.

* * *

సావిత్రి తన కథంతాచెప్పి కళ్ళనీళ్లెట్టుకుంది.

మాధవికి ఆశ్చర్యంగా అనిపించింది. ఇష్టపడి చేసుకున్న పెళ్ళాన్ని, కన్నపిల్లల్ని గాలికి వదిలేసి తాగుడుమత్తులో, మరో ఆడదాని పొందులో జోగారావు లాంటి వాళ్లు ఏం సుఖపడతారో అర్థంకాలేదు.

అంతా విన్నాక-"మరిమిమ్మల్నికాదనిమరో ఆడదాన్ని కట్టుకున్న ఆయన అప్పుడప్పుడు రావడం ఎందుకు?అల్లరిచెయ్యడంఎందుకు?" అనడిగింది మాధవి,

"ఎంత కాదనుకున్నా-పిల్లలమీద ప్రేమ ఉంటుంది కదా!" అంది సావిత్రి.

జోగారావు అప్పుడప్పుడు రావడం రాత్రి ఉండి వెళ్లడం చాలాసార్లు గమనించింది మాధవి.


ఆమెకు ఒకరకంగా సావిత్రిమీద కోపం కూడా వస్తుంది. తనకంత అన్యాయం చేసిన మొగుణ్ని ఇంట్లో కాలుపెట్టనివ్వకూడదని మాధవి అభిప్రాయం.

ఆమాట ఒకటిరెండుసార్లు అంటే సావిత్రి నవ్వేసి ఊరుకుంది.

జోగారావు ఓ రాత్రి తాగివచ్చి నానా అల్లరి చేసాడు. చుట్టుపక్కల వాళ్ళందరూ లేచి ఇళ్ళల్లోంచి బైటికి వచ్చారు. ఒకాయన కలిపించుకుని ఏదో చెప్పబోతే "నా పెళ్ళాం నా ఇష్టం. తిట్టుకుంటాను. కొట్టుకుంటాను. మీకనవసరం" అని తలుపేసేసాడు.

అది జరిగిన మర్నాడు మాధవిప్రత్యేకంగా సావిత్రి ఇంటికెళ్లింది.

"అసలు తప్పంతా మన ఆడవాళ్లలో ఉంది. మనకి బానిస మనస్తత్వంపోదు. ఆయన మీకంత అన్యాయం చేసాక ఆయన్ని ఇంట్లోకి రానివ్వడం మీతప్పు. మీరు, పిల్లలు ఉన్నారో




(మిగతా 51వ పేజీ)

(18వ పేజీ తరువాయి)

లేదో-తిన్నారో లేదో చూడని వ్యక్తిని ఇంటికి రానివ్వకూడదు. అసలు మీ అలుసు చూసు కునే ఆయనలా ప్రవర్తిస్తున్నారు" అంది మాధవి.

సావిత్రి నవ్వి ఊరుకుంది.

"ఇంటికి రావద్దని చెప్పేయండి. వచ్చి అల్లరి చేస్తుంటే మీరెంత బాధపడుతున్నారో నాకు తెలుసు" అంది.

సావిత్రి మౌనంగా ఊరుకుంది.

"ఆడది జీవితంలో ఏదేనా భరించవచ్చు కాని—మొగుణ్ని మరో ఆడదానితో పంచు కునే పరిస్థితిని భరించకూడదు" మాధవి సావిత్రిని రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తోంది.

సావిత్రి ఓ క్షణం మౌనంగా ఊరుకుంది. తర్వాత "మీరు చెప్పినవన్నీ ఒప్పుకుంటాను. నిజమే మన బానిస మనస్తత్వంవల్లే మగాళ్లు అలా ప్రవర్తిస్తారు. ఒప్పుకుంటాను. కాని జీవితం వేరు-ఆదర్శాలు, అభ్యుదయం వేరు.

ఆయన నన్ను పిల్లల్ని పోషించడం లేదని బ్యాంక్‌కు అప్లికేషన్ పెట్టి జీతంలో వాటాతీసు కుంటున్నాను. ఆర్థికంగా అయినా నేను, పిల్లలు అన్నం తింటున్నాం.

కాని—మనిషికి కావల్సింది తిండి ఒకటే కాదుకదా!" సావిత్రి చెప్పడం ఆపింది.

మాధవి అర్థం కానట్టు చూసింది.

"నాకు ముప్పైరెండోఏడు. ఆయన వేరే మనిషిని చేసుకున్నాడని నేను చేసుకోలేను కదా—చేసుకుందామన్నా ఎవరూ ముందుకు రారు—అవునా?

మగదిక్కు- వల్లకాదు పక్కన పెట్టండి.

నాలో కూడా మానవసహజమైన కోరిక లుంటాయి! అవి తీరాలికదా—

అందుకోసం నేను పరాయి మగాడితో సంబంధం పెట్టుకుంటే నా పరిస్థితిని అర్థం చేసుకుని నా మీద ఎవరూ జాలి. సానుభూతి చూపించరుకదా:

అభ్యుదయం, స్త్రీ స్వేచ్ఛ. హక్కులు అని ఉపన్యాసాలిచ్చేవాళ్ళుగాని. రచనలు చేసేవాళ్ళుగాని—నమ్మి. నా కోరికల్ని సానుభూతితో అర్థం చేసుకోరుకదా!

అందువల్ల నా కోరికలు—ఆయనతోనే- ఆయన తాగుబోతైనా. వ్యభిచారి అయినా- రాక్షసుడైనా ఆయనతోనే తీరాలి—

అందుకే ఆయన తాగివచ్చినా. అల్లరి చేసినా, పదిమందిముందు నా పరువుగంగలో కలిపినా—ఆయన్ని రానిస్తున్నాను. ఇకముందు కూడా రానిస్తాను".

సావిత్రి చెప్పడం ఆపి మాధవికేసి చూసింది.

మాధవి కళ్ళు వర్షిస్తున్నాయి. ఆమె ఆప్యాయంగా సావిత్రి చెయ్యిపట్టుకుంది. ●●

## వింతలు-విడ్డూరాలు

*రైలు కరక్టు టైముకు రావడం
*బస్సు కండక్టరు చిల్లర తిరిగిఇవ్వడం
*పోలీసులకు బూతులు రాకపోవడం
*అవినీతి ఆరోపణలున్న మనమంత్రులు తమ పదవికి రాజీనామా చేయడం.
*ముఠాల్లేకుండా ఇండియాలో పార్టీలుండటం.

## 370కిలోల బరువున్న మనిషి

అమెరికాలో ఓనగరంలో "భారీ బాడీదారుడు న్నాడు. ఇతని శరీరం ఏనుగులాగుంటుందట! ఇతడుండే ఇంటి వాకిళ్ళు నాలుగ్గజాలు వెడల్పుగా చేయించి పెట్టుకున్నాడు. చివరికి బాత్‌రూం టాయ్‌లెట్స్ వాకిళ్ళ కూడా స్పెషల్‌గానే ఉన్నాయట.

ప్రయాణాల్లో మరీ ఇబ్బంది. రైల్లో దూర లేడు. కార్లో పట్టలేడు. ఓ పెద్దవాన్ వెనుక పక్క పూర్తిగా ఓపెన్ చేసి విశాలమైన సీట్లు లేని బాడీలో కూర్చుని వెడతాడట.

బరువు మాత్రం 370కిలోలు మాత్రమే: కూర్చుంటే ఆరడుగుల వెడల్పయిన కుర్చీ (బాగా బలంగా వుండేది) కావాలి. తిండి విషయానికొస్తే పూటకి పాతిక మంది తినే తిండి టిఫిన్‌లా తింటాడట.

ఇతని వయస్సు 26 ఏళ్ళే! ప్రపంచంలో లావు, భారీకాయుల లిస్టులో మొదటి వాడుగా గిన్నిస్ బుక్‌లోకి ఎక్కి- ఈ పెద్ద మనిషి ఊరికే కూర్చోక "బరువు తగ్గించుకొనేదెలా? అన్న పుస్తకం రాస్తున్నాట్ట. —పురుమాండ్ల

## ఇంట గెలిచిరచ్చగెలువు

గాంధీజీ ఎప్పుడూ పదవుల కోసం ప్రాకులాడలేదు. తను నమ్మిన సిద్ధాంతాన్ని మనసావాచా ఆచరించాకనే ఇతరులకు బోధించే ప్రయత్నం చేసేవాడు.

గాంధీజీ అహింసాసిద్ధాంతం బహుళ ప్రాచుర్యం పొందుతున్న రోజులవి. అమెరికాలో నీగ్రో ఉద్యమం కూడా గాంధీజీ ప్రబోధించిన అహింసా సిద్ధాంతంపైనే ఆధారపడింది. తెల్లవాళ్ళతో సమానంగా పౌరసత్వం కావాలని పోరాటం సాగిస్తున్నారు నీగ్రోలు. తమ పోరాటానికి నాయకత్వం వహించమని నీగ్రోనాయకులు గాంధీజీని కోరారు.

అప్పుడు గాంధీజీ—"నా అహింసా సిద్ధాంతం ఎంతవరకు పనికి వస్తుందా అనేది నాదేశంలోనే నేనింకా ఋజువు చేసుకోలేదు. ఇక నేను అమెరికా వచ్చి ఏం చేస్తాను." అన్నారు. అందరూ ఆత్మ పరిశీలన చేసుకోవలసిన సమాధానం ఇది.

గాంధీజీ స్వదేశంలోనూ అంతే!

గోఖలేవంటి మహానాయకుడు గాంధీజీని పూనాలోనే వుండి సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ కోసం పని చేయవలసిందిగా కోరారు.

అప్పుడు కూడా గాంధీజీ—"మొదటనేను అహమ్మదాబాదులో ఉండి గుజరాత్ అభివృద్ధి కోసం కృషి చేయాలి. అక్కడి వారి నమ్మకాన్ని నేను చూరగొనాలి. ఆ తర్వాతనే ఏదైనా సంగతయినా, ఇప్పుడు కాదు". అని సమాధానం చెప్పారు.

భూషికృష్ణదాసు

